క్లుప్తంగా

రైతులకు రుణాలు



మాట్లాడుతున్న చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు అన్ని రకాల రుణాలు ఇస్తున్నామని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో సోమవారం అర్ధ వార్షిక మహాజనసభ నిర్వహించి, ఐదు నెలల కాలంలో చేపట్టిన పనులను ఆమోదించడంతో పాటు త్వరలో చేపట్టబోయే పనులపై చర్చించారు. అనంతం సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ ప్రక్రియలో 1063 మంది రైతులకు రూ.నాలుగు కోట్ల 60 లక్షలు రుణమాఫీ అయిందన్నారు. కార్యక్రమంలో సీఈఓ సిద్ధయ్య, డైరెక్టర్‌లు నర్సింలు, పోతిరెడ్డి, కృష్ణాగౌడ్, నర్సింహరెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీటి నిల్వ తొలగింపు



రోడ్డుపై నీటిని తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): చండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనుల గురించి సాక్షి దినపత్రికలో సోమవారం నిలిచిపోయిన రోడ్డు పనులు కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించారు. నవాబుపేట గ్రామ శివారు వద్ద రోడ్డుపై నిలిచిన నీటితో బురదగా మారడంతో ఇరువైపుల మట్టిని తొలగించి వాహన రాకపోకలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణకు సంబంధించి పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి వరకు పనులు జరుగుతున్నాయని త్వరలోనే చండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ చెప్పారు.

వ్యాసరచన పోటీలు



బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విజేతలకు హెచ్‌ఎం సుమంగళి, గ్రామ కార్యదర్శిలు బహుమతులు అందజేశారు.

భూముల వివరాలు ఇవ్వండి



దరఖాస్తుతో చిట్టోజిపల్లి యువకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో భూముల వివరాలను తెలియజేయాలని సమాచార హక్కు చట్టం కింద చిట్టోజిపల్లి గ్రామస్తులు చేగుంట తహసీల్దార్‌కు దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. చిట్టోజిపల్లి గ్రామం శివారులో 266/1 సర్వే నంబర్‌లో భూములకు సంబంధించిన వివరాలను అందించాలని దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపూర్ గ్రామం వేంకటేశ్వర ఆలయ భూములు చిట్టోజిపల్లి శివారులో ఉండగా, వాటిని గ్రామస్తులు ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. వారికి పట్టాలు రావడం లేదని, భూముల వివరాల కోసం సమాచారం ఇవ్వాలని దరఖాస్తు చేశామని తెలిపారు. దరఖాస్తు చేసిన వారిలో రాజు, పరశురాములు, ఎల్లం, ప్రవీణ్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు



సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద మద్యం బాటిళ్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. కౌడిపల్లిలోని పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం, ఎంఆర్‌పీ, వ్యవసాయశాఖ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం వరండాల్లో నిత్యం మందుబాబులు మద్యం తాగుతూ సీసాలు అక్కడే వదిలేస్తున్నారు.

బతుకమ్మ సంబరాలు ప్రారంభం



కౌడిపల్లి(నర్సాపూర్): బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు



మెదక్‌జోన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



చేగుంటలో బతుకమ్మలతో మహిళలు



మెదక్‌జోన్: బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు,



నిజాంపేటలో ..

మెదక్‌జోన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ పండుగ సంబరాలను సోమవారం కళాశాల మెయిన్ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ డా. హుస్సేన్ ప్రారంభించారు. విద్యార్థినులు బతుకమ్మలను అందంగా తయారు చేసి ఆటలు ఆడారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం బాధ్యులు డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఫణికుమార్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మలు తయారు చేసి ఆడారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ నరసింహ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో బతుకమ్మ పండుగను నిర్వహించారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలో బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

చర్చించేందుకు అవకాశం ఇవ్వరా?

● బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్: మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించేందుకు తమకు అవకాశం ఇవ్వట్లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ మేరకు సమావేశంలో బతుకమ్మ పండుగ సందర్భంగా పెద్ద చెరువు కట్టపై ఏర్పాట్లు, పట్టణంలోని ఆయా వార్డులో డ్రైనేజీలు, మ్యాన్‌హోళ్లు, రామాలయంలో సమీపంలో గతంలో డంప్‌యార్డు కోసం నిర్మించిన షెడ్డును రామాలయం కమ్యూనిటీ హాల్ నిర్వహణ కోసం వినియోగించాలని తీర్మానం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆందోళన

తమ సమస్యలను వినకుండానే కౌన్సిల్ సమావేశం ముగించుకొని వెళ్లిపోయారని మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. సమావేశం ప్రారంభమైన కాసేపటికే బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యేందుకు వస్తున్న క్రమంలో సీసీ కెమెరాల్లో చూసి ఆదరాబాదరగా కౌన్సిల్ సమావేశం ముగించుకొని పారిపోయారని తెలిపారు. మున్సిపల్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ ఆందోళనలో కౌన్సిలర్లు రాఘవేందర్‌గౌడ్, ఉమా, లావణ్య, అరుణ, పద్మ ఉన్నారు.

రోడ్డు పక్కనే చెత్త పారవేత

నర్సాపూర్: మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది పట్టణంలో సేకరించిన చెత్తను జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న దేవాలయ భూముల్లో వేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఒకవైపు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. పారిశుద్ధ్య సిబ్బంది తమ ఇష్టానుసారంగా రోడ్డు పక్కన చెత్త పారవేసి నిప్పంటిస్తున్నారు. మున్సిపాలిటీ కోసం డంప్‌యార్డు ఏర్పాటు చేసి పట్టణంలో సేకరించే చెత్తను వేసేందుకు పట్టణ శివారులోని 731 సర్వే నంబర్‌లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం మున్సిపాలిటీకి కేటాయించింది. ప్రభుత్వం కేటాయించిన భూమిలో తడి, పొడి చెత్తను వేరు చేసి డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్(డీఆర్‌సీసీ) ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేయాలన్న లక్ష్యంతో రూ.3 లక్షలతో నిర్మించిన డీఆర్‌సీసీ భవనాన్ని వినియోగంలోకి తేవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో డీఆర్‌సీసీ భవనం నిరుపయోగంగా తయారైంది. డంప్‌యార్డు కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిలో పట్టణంలో సేకరించిన చెత్తను పారవేయాల్సి ఉండగా, కొందరు పారిశుద్ధ్యం సిబ్బంది పట్టణంలో సేకరించిన చెత్తను తమ ఇష్టానుసారంగా దేవాలయ భూముల్లో పారవేసి నిప్పటిస్తున్నారు. దీంతో చెత్తలో ఉండే ప్లాస్టిక్ కవర్లు సైతం నిప్పంటుకొని ఘాటైన దుర్వాసన రావడంతో నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. పట్టణంలో చెత్త సేకరించే పనులపై మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ సరిగా లేనందునే కింది స్థాయి సిబ్బంది చెత్తను ఇష్టానుసారంగా పారవేయడంతో పాటు నిప్పంటిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డాక్టర్ రామకృష్ణరావును వివరణ కోరగా.. తాను పరిశీలించి దేవాలయ భూముల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.



నర్సాపూర్ - మెదక్ జాతీయ రహదారి పక్కన చెత్తమయంగా మారిన దేవాలయ భూములు

భవనాలు పూర్తి చేయాలి

నర్సాపూర్: డంప్ యార్డులో నిర్మాణంలో ఉన్న డ్రై రిసోర్సెస్ కలెక్షన్ సెంటర్(డీఆర్‌సీసీ) భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావుకు సూచించారు. ఆయన సోమవారం మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పట్టణానికి కేటాయించిన డంప్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. డీఆర్‌సీసీ నిర్మాణ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని తెలిపారు. వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈఓ నాగరాజు, ఆసిఫ్, రైతులు సత్యాగౌడ్, అంజిరెడ్డి, బాలరాజు, పోచయ్య, విఠల్, బేతయ్య ఉన్నారు

కుంటను రక్షించండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని కప్పల కుంటను రక్షించాలని సోమవారం ప్రజావాణిలో గ్రామస్తులు తహసీల్దార్ గఫూర్‌మియాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కుంట పారకం ద్వారా దాదాపు 20 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పని కింద 2011 వరకు మూడు ఏళ్లలో కుంటలో పూడికతీత పనులు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం ఈ కుంటను గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాదగిరి పూర్తిగా చదును చేసి, ఆ భూమి తనదిగా చూపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కుంటను సంరక్షించి, పొలాలకు సాగునీరు అందేలా చూడాలని అధికారులను కోరారు.

మద్యం మత్తులో దాడి

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో పలువురి పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ప్రశాంత్ ఆదివారం రాత్రి మద్యం మత్తులో పలువురిపై దాడికి పాల్పడగా క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై ఓ దినపత్రికలో సోమవారం గంజాయి మత్తులో పలువురిపై దాడి చేసినట్లు ప్రచురించడం పూర్తి అవాస్తవం అన్నారు. మద్యం మత్తులో జరిగిన దాడిని గంజాయి మత్తులో జరిగినట్లు తప్పుడు కథనాలు, వదంతులు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

● డీఎస్సీలో అక్కన్నపేట యువకుల ప్రతిభ



జంగం నవీన్



శ్రీధర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన యువకులు ప్రతిభ కనబర్చారు. జంగం నవీన్ డీఎస్సీ పరీక్షలో ఫిజికల్ సైన్స్ విభాగం జనరల్ కేటగిరిలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించారు. అదే గ్రామానికి చెందిన శ్రీధర్‌గౌడ్ సోషల్ స్టడీస్ విభాగంలో జిల్లా స్థాయి ఆరో ర్యాంక్ సాధించారు.

రెండో ర్యాంకు సాధించిన నరేందర్



నరేందర్

చేగుంట(తూప్రాన్): డీఎస్సీ ఫలితాల్లో మండలానికి చెందిన నరేందర్ స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో మెదక్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించాడు.

తెలుగులో 2వ ర్యాంక్



మల్లికార్జున్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన పసుల మల్లికార్జున్ లాంగ్వేజ్ పండిట్ తెలుగు విభాగంలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు.

నరేష్‌రాథోడ్‌కు ద్వితీయ ర్యాంకు



నరేష్‌రాథోడ్

నర్సాపూర్: మండలంలోని ఎర్రగుంట తండాకు చెందిన నరేష్‌రాథోడ్ డీఎస్సీ ఫలితాల్లో 67 మార్కులు సాధించి, జిల్లాలో ఎస్టీ విభాగంలో ద్వితీయ ర్యాంకు సాధించారు.

జిల్లా స్థాయిలో వెంకటేష్‌కు ఫస్ట్ ర్యాంకు

నర్సాపూర్: డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మండలంలోని గొల్లపల్లికి చెందిన వెంకటేష్ జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు.

శాలిపేట నుంచి ముగ్గురు



దండు రామకృష్ణ



దండు శ్రీనివాస్



మాలే రవీందర్

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సత్తా చాటారు. ముగ్గురు రైతు కుటుంబాల నుంచి వచ్చి ఉత్తమ ఫలితాలు సాధించారు. శాలిపేట గ్రామానికి చెందిన దండు రామకృష్ణ జిల్లాలో ఎస్‌జీటీ 4వ ర్యాంకు రాగా, దండు శ్రీనివాస్ ఎస్‌జీటీ 25వ ర్యాంకు పొందారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మాలే రవిందర్ స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో జిల్లాలో 2వ ర్యాంకు సాధించారు.

డీఎస్సీలో విష్ణు డబుల్ ధమాకా



విష్ణుమూర్తి

పాపన్నపేట(మెదక్): మండలంలోని లింగాయపల్లికి చెందిన విష్ణుమూర్తిగౌడ్ సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో డబుల్ ధమాకా సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో మొదటి ర్యాంకు, ఫిజికల్ సైన్స్ విభాగంలో 5వ ర్యాంకు సాధించాడు.

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు పోషకాహారం భుజిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్ అంగన్‌వాడీ కేంద్రంలో మండలల్లోని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వయోవృద్ధులతో పోషకాహారం భుజిస్తామమని మహిళలు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సంతోషి మాత మాట్లాడుతూ.. వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించి, పోషణ మాసోత్సవాలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సలీమా ఆధ్వర్యంలో చిన్నారుల నానమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): అంగన్‌వాడీ కేంద్రాలలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం వేడుకలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని జీడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు వయోవృద్ధులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహతాబ్ బేగం, కార్యదర్శి సత్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాతూర్‌లో పోషణ్ అభియాన్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని పాతూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు. పౌష్టికాహారం గురించి ఆమె వివరించారు. పంచాయతీ సెక్రటరీ ఫాతిమా, డాక్టర్ నవీన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటలు భద్రం

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత



చిలప్‌చెడ్(నర్సాపూర్): మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు రాహుల్, సరిత



పాపన్నపేట(మెదక్): మండలంలో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సస్యరక్షణ చర్యలతో పంటలు భద్రంగా ఉండి, అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంగుపేట, సరిత అన్నారు. సోమవారం మండలంలోని గౌతాపూర్ గ్రామంలో ఆమె ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి గ్రామంలోని వనరులపై చార్టులు, పోస్టర్లతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాహుల్ మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటలసాగు చేస్తే నేలలు సారవంతంగా ఉండడంతో పాటు, అధిక దిగుబడి వస్తుందన్నారు. శాస్త్రవేత్త సరిత మాట్లాడుతూ.. పంటలకు చీడపీడలు సోకకుండా రసాయనాలు, ఎరువులు తక్కువ మోతాదులో వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు దినేష్‌రెడ్డి, చంద్రు, శ్రావణ్, మణి, నాయకులు విఠల్, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

దోమపోటుతో జాగ్రత్త

పాపన్నపేట(మెదక్): వరి పంటకు కొన్ని చోట్ల దోమ పోటు సోకిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎం.విజయ్ కుమార్, జే.విజయ్ కుమార్, సరిత తెలిపారు. సోమవారం పాపన్నపేట మండలంలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ.. కొన్ని చోట్ల దోమపోటు, పాము పొడ తెగులు కనిపించిందని చెప్పారు. దోమపోటుకు డైనెటోఫ్యూరా, వేపనూనె, పాముపొడకు టేడుకోనజోల్, మ్యాంకోజెట్ వాడాలని సూచించారు. వారి వెంట పాప

సంక్షిప్త వార్తలు

◆ **ప్రజావాణిలో ఐదు దరఖాస్తులు**

నర్సాపూర్: పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఐదు దరఖాస్తులు వచ్చాయని మండల తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు ఇచ్చారని ఆయన చెప్పారు.

◆ **పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ**

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులకు దుస్తులను అందజేశారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు రాజ్‌కుమార్, నాఘనాథ్‌రావు, పెంటయ్య, రమేశ్, అశోక్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి వెంకటరాములు, సిబ్బంది నందు తదితరులు ఉన్నారు.

◆ **సీపీఎం కార్యదర్శిగా నాగరాజు**

నర్సాపూర్: సీపీఎం నర్సాపూర్ ఏరియా కార్యదర్శిగా కదారి నాగరాజు రెండో సారి ఎన్నికయ్యారు. పార్టీ ఏరియా సమావేశంలో తనను రెండోసారి ఎన్నుకున్నారని ఆయన సోమవారం తెలిపారు.

◆ **పండ్ల తోటల పెంపకానికి ముందుకు రండి**



చిన్నశంకరంపేట(మెదక్): పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఎంపీడీఓ దామోదర్ అన్నారు. సోమవారం మండలంలోని కామారం తండా, రాజ్యతండాలో పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందించారు. ప్రభుత్వం పండ్ల తోటలు పెంచేందుకు ముందుకు వచ్చే రైతులకు అవసరమైన ఆర్థిక సాయం అందించడంతో పాటు పర్యవేక్షణ ఖర్చులను కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **సన్మానం**

నర్సాపూర్: పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సామ్యానాయక్‌ను పలువురు ఆ యూనియన్ సభ్యులు సోమవారం సన్మానించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న సామ్యానాయక్ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడంతో ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

◆ **వేతనాలు వెంటనే చెల్లించండి**

మెదక్ కలెక్టరేట్: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు బకాయి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ జిల్లా నాయకులు పద్మారావు, పోచయ్య పాల్గొన్నారు.

◆ **కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం**



శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చండి, గుండ్లపల్లి, కొంతన్‌పల్లి, దంతన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కార్యకర్తలను పరామర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రగౌడ్, కల్లూరి హరికృష్ణ, యాదగౌడ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, హర్జనాయక్, తదితరులు ఉన్నారు.

◆ **బీవీఆర్ఐటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం**

నర్సాపూర్: పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఈడీఈఎం సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో స్కిల్స్ మెరుగుపరచడంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో అల్టెయిర్ సంస్థ సీనియర్ టెక్నికల్ స్పెషలిస్ట్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, పలువురు హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.